నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 2 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI

యాదగిరిగుట్ట ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వస్తీవాచనం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- విష్వక్సేనారాధన, స్వస్తీవాచనంతో ఉత్సవాలు ప్రారంభం
- నేడు ధ్వజారోహణం

యాదగిరిగుట్ట, మార్చి 1 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి వార్షిక, నవాహ్నిక బ్రహ్మోత్సవాలను శనివారం ప్రారంభించారు. ప్రధానాలయంలో నిత్యపూజల అనంతరం స్వామివారి అనుమతితో వైశేక హోమాలు, ప్రత్యేక తిరుమంజనం జరిపారు. ముందుగా ఆలయ అనువంశికధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్భల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనారసింహచార్యులు, కాండూరి వేంకటాచార్యులు స్వామివారి గర్భాలయంలోకి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి నుంచి ఉత్సవాలకు అనుమతి పొందారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో దివ్య మనోహరంగా అలకంరించిన స్వామివారిని ప్రధానాలయం ముఖ మండపంలో తూర్పు అభిముఖంగా అధిష్టింపజేశారు. నవకలాభిషేకం చేసి బ్రహోత్సవాలు నిర్విఘ్నంగా కొనసాగాలని వేద మంత్రాలను పఠిస్తూ పాంచరాత్రగమ శాస్త్రరీతిలో విష్వక్సేనారాధన జరిపారు. స్వస్తీవాచనంలో ప్రధానార్చక బృందం ప్రధానాలయం, గర్భాలయం, మాఢవీధులు, ప్రాకార మండపాలను శుద్ధి చేశారు. రక్షాబంధనం జరిపారు. అనంతరం స్వయంభు నారసింహుడు, ఆండాళ్ అమ్మవారు, ఆళ్వారు, రామానుజాచార్యులు, విష్వక్సేనుడు, ఉత్సవ మూర్తులకు కంకణధారణ చేశారు. నిర్వాహక బృందం, భక్తులకు రక్షా బంధనం ధరింపజేశారు. సాయంత్రం మృత్సంగ్రహం, అంకురారోపణ వేడుకలను ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు అర్చక బృందం నిర్వహించింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణం, సాయంత్రం భేరీపూజ, దేవతాహ్వానం, హవనం నిర్వహించనున్నారు.

పెన్‌పహాడ్ : చిన్నగారకుంట తండాలో ఎండిన వరి పైరును పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

చేతులు జోడించి వేడుకుంటున్నా.. నీళ్లిచ్చి పంటలను కాపాడండి

లేదంటే రైతుల ఉసురు తప్పదు

- గోదావరిలో నీళ్లున్నా ఇసుక దందా కోసమే ఇవ్వడం లేదు
- కాళేశ్వరం ప్రాజెక్టు మాకు అప్పగించండి..
- మూడ్రోజుల్లో చివరి ఎకరం వరకూ నీళ్లు పారిస్తాం
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- పెన్‌పహాడ్ మండలంలో ఎండిన పంటల పరిశీలన
- వరి పొలానికి ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న రైతును చూసి కంటతడి
- జగదీశ్‌రెడ్డిని చూసి గోడు వెల్లబోసుకున్న రైతులు

రైతు అవస్థలకు చలించి కంటతడి పెట్టిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్, మార్చి 1 : 'ఈ ప్రభుత్వానికి రెండు చేతులు జోడించి దండం పెట్టి వేడుకుంటున్నా.. రైతులకు నీళ్లు ఇచ్చి పంటలు ఎండిపోకుండా ఆదుకోండి' అంటూ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. లేనిపక్షంలో రైతుల ఉసురు పాలకులకు శాపంగా మారుతుందని హెచ్చరించారు. మండలంలోని గాజులమల్కాపురం, చిన్నగారకుంట తండాలో ఎండిన పంట వరి పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. జగదీశ్‌రెడ్డి రాకతో రైతులు పెద్దఎత్తున చేరుకుని నీళ్లు లేక ఎండిన వరి పంటను గొర్లు, పశువులకు మేతగా ఇచ్చామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో, మీరు మంత్రిగా ఉన్నప్పుడు ఒక్క ఎకరం కూడా ఎండలేదని రైతులు గుర్తుచేశారు. పుష్కలంగా నీళ్లతో మడికట్లలో చేపలు కూడా పట్టుకున్నామని, నేడు ఎండిన పొలాలను మళ్లీ చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. మీరే ఏమన్నా చేయాలంటూ రైతులు, గిరిజన మహిళలు కోరారు. గాజులమల్కాపురంలో పొట్టదశలో ఉన్న వరి పైరును కాపాడుకునేందుకు రైతు గుండా వెంకన్న వాటర్ ట్యాంక్‌తో నీళ్లు పెడుతుండడం చూసి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చలించి కంట తడి పెట్టారు. మీ హయాంలో నీళ్లు, కరెంట్ కష్టాలు లేకపోవడంతో ధీమాగా పంటలు పండించుకున్నామని, ఇయ్యాల దింపుడుగల్లం ఆశగా ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్నామని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణా, గోదావరి ఆయకట్టులో పొలాలు ఎండిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పాపమేనన్నారు. ప్రభుత్వాన్ని నమ్మి పంటలు వేసి నష్టపోయామని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని, గోదావరిలో 10వేల క్యూసెక్కుల నీటి లభ్యత ఉన్నా ఇసుక వ్యాపారం కోసం పంటలను ఎండబెడుతున్నారని దుయ్యబట్టారు. కన్నెపల్లి పంప్ హౌస్ బటన్ ఆన్ చేస్తే చాలు పంటలన్నీ పండుతాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును మాకు అప్పగించి చూడండి.. మూడ్రోజుల్లో చివరి ఎకరం వరకూ నీళ్లు పారిస్తామని సవాల్ విసిరారు. కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరొస్తుందోనని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు తీస్తున్నదని మండిపడ్డారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఇప్పటికైనా కండ్లు తెరిచి నీళ్లు ఇచ్చి ఉన్న పంటలనైనా కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చేతులెత్తి మొక్కుతున్నా.. రైతులకు సాగు నీరు ఇవ్వండి. రైతులను చంపకండి అంటూ ఆవేదన చెందారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగందర్, సింగిల్ విండో చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, నాతల జానకిరాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ షేక్ బాషా, మొరిశెట్టి శ్రీనివాస్, ఇంద్రసేనారావు, మిర్యాల వెంకటేశ్వర్లు, షేక్ షరీఫ్, లక్ష్మణ్, దారావత్ మోతీలాల్‌నాయక్, మామిడి అంజయ్య, మామిడి పరందాములు, కట్ల నాగార్జున పాల్గొన్నారు.

జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలకు సారిక

నందికొండ, మార్చి1 : నాగార్జునసాగర్ పైలాన్ కాలనీకి చెందిన సారిక జాతీయ స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. గత నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 16 7వ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో ఆమె పాల్గొని ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి గెల్చుకుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన సారికను జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సారిక ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ చదువుతున్నది. జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన ఆమెను పైలాన్‌కాలనీ కృష్ణ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతి అందుకుంటున్న సారిక

రేపే ఓట్ల లెక్కింపు

ఉదయం 8 గంటల నుంచి షురూ

- ఒక కౌంటింగ్ హాల్... 25 లెక్కింపు టేబుళ్లు
- ముందుగా 8 రౌండ్లల్లో బండిల్స్ ప్రక్రియ
- తర్వాతే తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- ఒకే రౌండ్‌లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి
- చెల్లిన ఓట్ల నుంచి గెలుపు కోటా నిర్ధారణ
- ఫలితం తేలకుంటే రెండో ప్రాధాన్యత కౌంట్
- చివరి నుంచి ఎలిమినేషన్ పద్ధతిలో ప్రక్రియ
- సాయంత్రానికి తుది ఫలితం రావచ్చని అంచనా

వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసన మండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. నల్లగొండలోని ఐటీ హబ్ వెనుక ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాధారణ ఎన్నికల మాదిరి కాకుండా మండలి ఓట్ల లెక్కింపు ప్రక్రియ భిన్నంగా కొనసాగనుంది. ఓటింగ్‌లో ప్రాధాన్యత ప్రకారం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా, కౌంటింగ్ కూడా అదే విధంగా చేపట్టనున్నారు. ముందుగా పోలైన బ్యాలెట్లు అన్నింటినీ కట్టలుగా కట్టి తర్వాత తొలి ప్రాధాన్యత ఓట్లను మొదట లెక్కిస్తారు. ఆ సమయంలోనే చెల్లని ఓట్లను పక్కకు వేస్తారు. చెల్లిన ఓట్లను మాత్రమే పరిగణలోకి తీసుకుంటూ విజేతకు అవసరమైన కోటాను నిర్ణయిస్తారు. చెల్లిన ఓట్లల్లో యాభై శాతం ప్లస్ ఒకటి కలిపి విజేతకు అవసరమైన గెలుపు కోటాను నిర్ధారిస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్లలోనే ఈ గెలుపు కోటాను అభ్యర్థులు సాధిస్తే సరి. లేకుంటే ఎలిమినేషన్ పద్ధతిలో సుదీర్ఘంగా గెలుపు కోటా వచ్చే వరకు లెక్కింపు కొనసాగుతుంది.

– నల్లగొండ ప్రతినిధి, మార్చి 1(నమస్తే తెలంగాణ)

ఆర్జాలబావి కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లలో నిమగ్నమైన సిబ్బంది

ఓట్ల లెక్కింపు సరిగ్గా సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం అవుతుంది. మొత్తం ఓటర్లలో 93.57 శాతం ఓటింగ్‌తో 24,139 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ పూర్తి కాగానే 12 జిల్లాల్లోని 200 పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను నల్లగొండలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం 6 గంటలకే ఓట్ల లెక్కింపు అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్లు లెక్కింపు కేంద్రానికి చేరుకోనున్నారు. వారి సమక్షంలోనే స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేసి కౌంటింగ్ కేంద్రానికి సీరియల్ ప్రకారం బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌కు తరలించనున్నారు. ఓట్ల సంఖ్య తక్కువగానే ఉండడంతో ఒకే కౌంటింగ్ హాల్‌ను సిద్ధం చేశారు. ఇందులో ఓట్ల లెక్కింపు కోసం 25 కౌంటింగ్ టేబుళ్లు, ఒక రిటర్నింగ్ అధికారి టేబుల్‌ను ఏర్పాటు చేశారు.

8 రౌండ్స్‌లో బండిల్స్

మొత్తం 200 పోలింగ్ కేంద్రాల్లో కేంద్రానికి ఒక బ్యాలెట్ బాక్స్ లెక్కన మొత్తం 200 బ్యాలెట్ బాక్సులను పోలింగ్‌కు వినియోగించారు. వాటిని పోలింగ్ కేంద్రాల సీరియల్ నెంబర్ ప్రకారం ఒక్కో కౌంటింగ్ టేబుల్‌కు ఒక బ్యాలెట్ బాక్సును అందజేస్తారు. ఇలా ఒక్కో రౌండ్‌లో 25 టేబుళ్లపై 25 బ్యాలెట్ బాక్సులకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లను కట్టలుగా కడుతారు. ఒక్కో రౌండ్‌లో 25 అంటే మొత్తం 200 బాక్సులు పూర్తి కావాలంటే 8 రౌండ్లలో కట్టలు కట్టే కార్యక్రమం కొనసాగుతుంది. బ్యాలెట్ బాక్సుల్లోని బ్యాలెట్ పేపర్లను టేబుల్‌పై కుప్పగా పోసి 25 పేపర్లను ఒక కట్టగా కట్టి బండిల్స్ చేస్తారు. ఇలా మొత్తం బ్యాలెట్ బాక్సులు ఓపెన్ చేసి కట్టలు కడుతారు. ఎప్పటికప్పుడు బండిల్స్‌ను తీసుకెళ్లి ఆర్ఓ టేబుల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రమ్‌లో వేస్తారు. బండిల్ కట్టడం మొత్తం పూర్తయ్యాక ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. బండిల్స్ కట్టే పనికే కనీసం మూడు గంటల సమయం పట్టవచ్చని అంచనా. ఉదయం 11 గంటల వరకు ఇది పూర్తయితే ఆ తర్వాతే అసలు ఓట్ల లెక్కింపు మొదలుకానుంది.

ఈసారి నువ్వా..నేనా అన్నట్లు

ఈసారి ఫలితం తేలడానికి ఎక్కువ సమయమే తీసుకోవచ్చు. ప్రధాన అభ్యర్థుల్లో యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, టీచర్స్ జాక్ అభ్యర్థి పూల రవీందర్, బీజేపీ అభ్యర్థి సర్వోత్తంరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ సుందరరాజు తమకు భారీగా ఓట్లు పోలైనట్లు అంచనా వేస్తూ విజయంపై ఎవరి ధీమాను వారు ప్రదర్శిస్తున్నారు. నిజంగానే వీరి అంచనా ప్రకారం ఓట్లు పోటాపోటీగా పోలైతే ఫలితం అంత ఈజీగా తేలకపోవచ్చు. ఎవరికీ గెలుపు కోటా చేరుకోవడం అంత సులభం కాకపోవచ్చు. మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో ఎలిమినేషన్ రౌండ్ కూడా సుదీర్ఘంగా కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ఆరుగురిలో నలుగురు అభ్యర్థులను ఎలిమినేషన్ చేస్తే తప్ప తుది ఫలితం వెల్లడి కాకపోవచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఇదే జరిగితే తుది ఫలితం వెలువడే సరికి సోమవారం రాత్రి కావచ్చని భావిస్తున్నారు.

ఒకే రౌండ్‌లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు

అనుకున్న విధంగా ఉదయం 11 గంటల వరకు బండిల్స్ కట్టే ప్రక్రియ ముగిస్తే... తర్వాత తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఒక్కో టేబుల్‌కు 40 బండిల్స్ చొప్పున ఇస్తూ వెయ్యి ఓట్లను లెక్కిస్తారు. మొత్తం 25 టేబుళ్లపై ఒక్క రౌండ్‌లోనే పోలైన 24,139 ఓట్ల లెక్కించనున్నారు. ఇదే సమయంలో చెల్లని ఓట్లను సైతం పక్కన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్సులో వేస్తారు. ఈ ప్రక్రియ పూర్తవడానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని అంచనా. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సాయంత్రం 5 గంటల వరకు పూర్తి కావచ్చు. ఇది పూర్తయ్యాక చెల్లని ఓట్ల లెక్క తేల్చి మొత్తం చెల్లిన ఓట్లలో 50శాతం+1ని గెలుపు కోటాగా నిర్ధారిస్తారు. ఉదాహరణకు మొత్తం ఓట్లలో 24వేల ఓట్లు చెల్లుబాటైతే అందులో సగం అంటే 12000+1=12001 ఓట్లు వచ్చిన అభ్యర్థి విజేతగా నిలుస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికీ గెలుపు కోటా రాకపోతే అప్పుడు ఎలిమినేషన్ ప్రక్రియ మొదలవుతుంది.

తొలి ప్రాధాన్యత ఓట్లతో విజేత తేలకుంటే..

ఎలిమినేషన్ ప్రక్రియ విభిన్నంగా కొనసాగనుంది. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించే సమయంలో పోటీ చేసిన అభ్యర్థుల్లో ఎవరికైతే తక్కువ తొలి ప్రాధాన్యతా ఓట్లు వస్తాయో.. వారి ద్వితీయ ప్రాధాన్యతా ఓట్లను ముందుగా లెక్కించి ఆ అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తారు. తొలి ఓట్లలో చివరి స్థానంలో నిలిచిన అభ్యర్థికి పోలైన ద్వితీయ ఓట్లు.. ఏ అభ్యర్థులు పొందినవి వారికి కేటాయిస్తారు. ఇంకా కూడా కోటా రాకపోతే చివరి తక్కువ తొలి ప్రాధాన్యత వచ్చిన రెండో అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను పరిగణిలోకి తీసుకుని మిగతా వారికి పంచేస్తారు. ఆయా అభ్యర్థుల తొలి ప్రాధాన్యత ఓట్లకు ఎలిమినేషన్ ప్రక్రియలో వస్తున్న ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కులుపుకొంటూ ముందుకు వెళ్తారు. మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో గెలుపు కోటా వచ్చే వరకు కింది నుంచి పైకి అందరి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తూ వెళ్తారు. ఈ క్రమంలో ఎక్కడైనా ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడితో కౌంటింగ్‌ను నిలిపివేసి విజేతగా ప్రకటిస్తారు. ఒకవేళ ఇక్కడ కూడా ఫలితం తేలకపోతే తృతీయ ప్రాధాన్యతా ఓట్లును కూడా లెక్కించక తప్పదు. కిందటిసారి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి గెలుపు కోటా ఓట్లకు కేవలం 38 ఓట్ల దూరంలో నిలిచారు. దాంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో తుది ఫలితం వెల్లడైంది.

పొరపాట్లు జరగకుండా ఓట్ల లెక్కింపు చేపట్టాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మార్చి 1: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పొరపాట్లు జరగకుండా ఓట్ల లెక్కింపు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం ఆమె జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావి వేర్‌హౌజింగ్ గోదాములో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బంది శిక్షణ కార్యక్రమాన్ని సైతం పరిశీలించి మాట్లాడారు. ఓట్ల లెక్కింపుకు నియమించిన సిబ్బంది కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుండి చివరి వరకు పూర్తి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రదానంగా ఫామ్–16సరిపోల్చుకోవటం బ్యాలెట్ బాక్సులను అభ్యర్థులు, వారి ఏజంట్ల సమక్షంలో సీలు తీసి సంబందితం ఫారంలో సంతంకం చేసే విదంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. చెల్లని ఓట్ల విషయంలో సందేహాలు ఉంటే ఏఆర్వో లేదా ఆర్వో దగ్గర నివృత్తి చేసుకోవాలని అప్పటికి సమస్య క్లియర్ కాకపోతే తన దృష్టికి తీసుకోని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ కుమార్, డీఆర్వో అశోక్ రెడ్డి ఆర్డీవోలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

అడుగంటిన ఆశలు

- రూ.3లక్షలు పెట్టి బావి పూడిక తీసినా నీటి ఊట కరువు
- నాలుగెకరాల్లో ఎండిన వరి

రైతు హన్మంతుల సత్తయ్య తన వ్యవసాయబావిలో పూడిక తీసినా కనిపించని నీటిజాడ

ఎండిన సత్తయ్య పొలం

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 28 : ఆత్మకూర్.ఎం మండలంలో కరువు పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. సాగునీటి వసతి లేక, భూగర్భజలాలు ఇంకిపోయి ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నాయి. పొట్ట దశలో ఉన్న వరి పైర్లు కండ్ల ముందు ఎండిపోతుండడంతో కాపాడుకునేందుకు రైతులు నానా గోస తీస్తున్నారు. మండలంలోని కూరెళ్ల గ్రామానికి చెందిన రైతు హన్మంతుల సత్తయ్యకు ఆరెకరాల భూమి ఉంది. తనకున్న వ్యవసాయ బావి ఆధారంగా ప్రతి సీజన్‌లో వరి సాగు చేస్తుంటాడు. ఈ యాసంగిలోనూ వరే పెట్టాడు. కానీ ప్రస్తుతం బావిలో నీళ్లు అడుగంటాయి. పొట్ట దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు 3లక్షల రూపాయలు ఖర్చు చేసి క్రేన్ సాయంతో పుడిక తీయించినా చుక్క నీరు ఊరలేదు. ఉన్న బోరు కూడా ఆగి ఆగి ఇంట్లో నల్లా లెక్క పోస్తున్నది. దాంతో ఆరెకరాల్లో ఇప్పటికే నాలుగు ఎకరాల వరి పంట ఎండిపోయింది. ఉన్న రెండెకరాలను ఎలా కాపాడుకోవాలో తెలియక సత్తయ్య అవస్థ పడుతున్నాడు.

మేళ్లచేర్వు ఉత్సవాల్లో బండ లాగుతున్న గిత్తలు

జోరుగా సాగుతున్న ఎడ్ల పందేలు

మేళ్లచెర్వు, మార్చి 1 : మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా మేళ్లచెర్వులో నిర్వహిస్తున్న ఎడ్ల పందేలు ఉత్సాహంగా, ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న గిత్తలు బండ లాగుడు పోటీల్లో తలపడుతున్నాయి. శనివారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరగ్గా.. చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. మరోవైపు కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉత్సవాల సందర్భంగా స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని తాసిల్దార్ జ్యోతి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఈఓ కొండారెడ్డి పాల్గొన్నారు.